నవతెలంగాణ
నవ్యపథ తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
బుధవారం | జూన్ 19, 2024 | www.navatelangana.com

అందుబాటులో 2లక్షలకుపైగా విత్తన ప్యాకెట్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో వివిధ మండలాలలో (313) విత్తన డీలర్‌ల వద్ద 2,75,532 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలాల్లోని విత్తన దుకాణంలో సంప్రదించి కొనుగోలు చేయవచ్చని తెలిపారు. రైతులు విత్తన లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో జిల్లా, మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. రైతులకు ఏ విత్తన దుకాణాదారుడైన గరిష్ఠ అమ్మకం ధర కంటే ఎక్కువకు విక్రయించినా, పత్తి విత్తనాలు అందుబాటులో ఉండి ఇవ్వకుంటే మండల వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. విత్తనాల కొనుగోలు లైసెన్స్ డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, విధిగా రశీదు పొందాలని పేర్కొన్నారు. పంటకాలం పూర్తి అయ్యేవరకు ప్యాకెట్ బిల్లు భద్ర పరుచుకోవాలని పేర్కొన్నారు. విత్తనాల ఎంపికలో సలహాలు, సూచనలకు, నకిలీ విత్తనాల సమాచారం తెలిస్తే 8074812429 నెంబరును సంప్రదించాలని సూచించారు.

రైతు నేస్తం కార్యక్రమం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు.



ఈ సందర్భంగా హైదరాబాద్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వివిధ రకాల వరి, పత్తి వంగడాలు, వాటి దిగుబడి, సామర్థ్యం గురించి అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో గణేశ్, ఏఈవోలు ఉమేశ్, మౌనిక, భూమేశ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై నజర్..!

- జులై నుంచి ఏజెన్సీలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే
- సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- వైద్యులు, సిబ్బంది నియామకానికి కసరత్తు
- ముందస్తుగా అప్రమత్తమైన అధికార యంత్రాంగం

వర్షాకాలం ప్రారంభం కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రతి ఏటా సీజనల్ వ్యాధుల ప్రభావంతో జిల్లావాసులు ఇబ్బందులు పడుతుండటం సాధారణంగా మారింది. తీవ్ర జ్వరాల భారినపడి అక్కడక్కడ కొందరు మరణిస్తున్న సందర్భాలున్నాయి. ఈ ఏడాది సైతం అలాంటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతోంది. ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ముందస్తుగా జ్వరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించడంతో పాటు ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. మరోపక్క గతేడాది డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వైద్యాధికారులు చెబుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వర్షాకాలం వచ్చిందంటే చాలు జిల్లా వాసులు వివిధ రకాల జ్వరాలతో వణికిపోతుంటారు. పరిసరాల అపరిశుభ్రత, నీటి కాలుష్యం తదితర కారణాలతో జ్వరాలు ప్రబలుతుంటాయి. జిల్లా కేంద్ర ఆసుపత్రులతో పాటు పీహెచ్‌సీల్లోనూ జ్వర బాధితుల సంఖ్య పెరుగుతుంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ముందస్తు నివారణ చర్యలకు ఉపక్రమిస్తోంది. ఇప్పటికే వైద్యారోగ్య, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, మున్సిపల్, పంచాయతీ తదితర సమన్వయ శాఖల అధికారులతో ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు. పల్లెలను శుభ్రంగా ఉంచడంతో పాటు ప్రతి శుక్రవారం డ్రైడే వంటి కార్యక్రమాలు చేపడుతూ నీటి నిల్వ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. దోమలను నివారించేందుకు వివిధ రకాల పద్ధతులు పాటించాలని సూచించారు. ముఖ్యంగా పీహెచ్‌సీల్లో సిబ్బంది ఖాళీలను సైతం భర్తీ చేసేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. నలుగురు వైద్యులతో పాటు 26 స్టాఫ్ నర్సులు, 13మంది ఏఎన్‌ఎంలను నియమించేందుకు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలోని 22 పీహెచ్‌సీలన్నింటిలోనూ వైద్యులు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. అవసరమైన మందులన్నింటినీ పీహెచ్‌సీలకు చేర్చారు. ఆసుపత్రిల్లోనూ అవసరమైన సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు..!

జిల్లాలో అధికంగా జ్వరాలు ప్రబలే అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను వైద్యారోగ్యశాఖ అధికారులు గుర్తించారు. కిందటేడాది 11 డెంగ్యూ కేసులు నమోదు కాగా...ఎక్కడెక్కడ వివిధ రకాల జ్వరాలు ప్రబలుతున్నాయో అలాంటివి 165 ప్రాంతాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అక్కడ ముందస్తుగానే దృష్టిసారించి క్యాంపులు నిర్వహించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాలు చేపడుతూ ముందస్తుగా అప్రమత్తమవుతున్నారు. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, వైరల్ వంటి జ్వరాలు అధికంగా ఏజెన్సీ ప్రాంతాల్లోనే వస్తున్న దృష్ట్యా జులై 1 నుంచి ర్యాపిడ్ సర్వే చేపట్టాలని నిర్ణయించారు. ఇంటికి వెళ్లి జ్వర బాధితుల వివరాలు తెలుసుకోవడంతో పాటు ఎవరికైనా జ్వరాలు ఉంటే అప్పటికప్పుడే మందులు అందించడం వంటి చర్యలు చేపట్టనున్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను సైతం నియమించారు. మరోపక్క వర్షాకాలంలో వాగులు పొంగిపొర్లడం కారణంగా గర్భిణీలు సకాలంలో ఆస్పత్రులకు రాలేకపోతుంటారు. రహదారులు, వంతెనలు తెగిపోవడం కారణంగా ప్రసవం కోసం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి వారి కోసం బర్త్ వెయిటింగ్ రూంలను ఏడు చోట్ల ఏర్పాటుచేశారు.

అప్రమత్తంగా ఉన్నాం : నరేందర్ రాథోడ్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి



సీజనల్ వ్యాధులను ముందస్తుగానే నివారించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాం. ఇప్పటికే ఆయా శాఖల అధికారులతో ఉన్నతాధికారి సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. వైద్యులు, సిబ్బందితో పాటు మందులను అందుబాటులో ఉంచాం. జ్వరాల తీవ్రత పెరగకుండా అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు తీసుకుంటాం.

కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



నవతెలంగాణ-మంచిర్యాల

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని గాంధీ పార్కులో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వస్తే బీసీ కుల గణన చేసి స్థానిక సంస్థలో బీసీ రిజర్వేషన్లను 42శాతం పెంచి వాటిని ఏబీసీడీ గ్రూపులుగా వర్గీకరిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు. రాష్ట్ర జనాభాలో 56శాతం బీసీ జనాభా ఉంటే స్థానిక సంస్థల రిజర్వేషన్లు కేవలం 18 శాతం మాత్రమే కల్పించారని, ఇది పూర్తిగా బీసీల పట్ల వివక్షగా భావిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి బీసీలకు రావాల్సిన ప్రజాస్వామ్య వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు తుల మధుసూదన్, కర్రె లచ్చన్న, నెన్నెల నర్సయ్య, అక్కల రమేష్, కీర్తి భిక్షపతి, అరెందుల రాజేశం, చంద్రగిరి చంద్రమౌళి, బండ సతీష్, నగునూరి లక్ష్మణ్, మామిడిశెట్టి వెంకటేష్, బైర మల్లేష్, ధర్మాజీ సంజీవ్, కొంతం రాజు పాల్గొన్నారు.

ఉచిత సివిల్ లాంగ్‌టర్మ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్-2025 (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్షకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా బీసీ శాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుల ప్రక్రియ జూన్ 19నుండి జులై 3వరకు కొనసాగుతుందని, జులై 18 నుండి శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మొత్తం 150 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనుండగా, అందులో 100 మందికి జులై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. మరో 50 మంది అభ్యర్థులను ఇంతకు ముందు యూపీఎస్సీ వారు నిర్వహించిన సివిల్ సర్వీసెస్(ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని తీసుకుంటామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత పత్రాలతో స్టడీ సర్కిల్ లక్ష్మీనగర్‌కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో దరఖాస్తును అందజేయాలని పేర్కొన్నారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, భోజన, రవాణా కోసం నెలకు రూ.5వేలు, అలాగే బుక్ ఫండ్ నిమిత్తం రూ.5వేలు ఒక్కసారి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గ్రంథాలయ సదుపాయం కూడా కల్పించారని పేర్కొన్నారు. ఉచిత శిక్షణ హైదరాబాద్‌లో ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సందేహాలకు, వివరాలకు 08732221280 నెంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలపై ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-నస్పూర్

గర్భిణులు ఆసుపత్రులలోనే ప్రసవం చేసుకునే విధంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా.ఎస్. అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9న బెల్లంపల్లికి చెందిన ఇప్ప గంగకు జిల్లా కేంద్రంలోని మాతా-శిశు కేంద్రంలో అవసరమైన పరీక్షలు నిర్వహించి సిజేరియన్ ద్వారా ప్రసవం చేశామన్నారు. 6రోజుల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యంగా ఉందని తెలిపారు. గర్భిణులు పాటించవలసిన ఆరోగ్య జాగ్రత్తలలో భాగంగా ప్రతి రోజు కొంతసేపు నడిచి నవజాత శిశు కేంద్రంలోని తన బిడ్డకు తల్లిపాలు అందించిందని, ఆరోగ్య స్థితి కూడా బావుందని తెలిపారు. ఈ నెల 15న దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా ఆమెకు వెన్నుముక నొప్పి రావడంతో ఎంఆర్‌ఐకు సిఫారసు చేశామని, స్కానింగ్‌లో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నట్లుగా నిర్ధారణ అయిందని తెలిపారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించామన్నారు. మాతా-శిశు కేంద్రంలో అందించిన చికిత్స, వైద్య సేవలలో ఎలాంటి పొరపాటు లేదని గాంధీ ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారని తెలిపారు.

వర్షాలు సమృద్ధిగా కురవాలని కప్పతల్లి ఆట

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షాలు సమృద్ధిగా కురవాలని అగ్రో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కప్పతల్లి ఆట ఆడారు. మంగళవారం పంజాబ్ చౌక్ నుంచి ఎంప్లాయీస్‌లు కప్పతల్లి ఆడుతూ అశోక్ రోడ్డులోని పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఇక్కడ ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వర్షాలు కురిసి అన్నదాత సుఖంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అగ్రో ఉద్యోగులు వర్షాలు కురవాలని కప్పతల్లి ఆడుతున్నారని ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి గండ్రత్ సంతోష్ తెలిపారు. అన్నదాతలకు పంటలు బాగా పండాలని కోరుతూ గురువారం మర్వాడి దర్మశాలలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టామని, దీనికి ఛాంబర్స్ అఫ్ కామర్స్ అధ్యక్షుడు కమల్ కిషోర్ అగర్వాల్, అగ్రో డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు విలాస్‌రెడ్డి సహకరించారని తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్స్ అఫ్ కామర్స్ కార్యదర్శి గండ్రత్ సంతోష్, అగ్రో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బేర శరత్ చంద్ర, విలాస్‌రెడ్డి, సంతోష్, రాజు, గణేష్, ఆశారెడ్డి, రాము, లింగారెడ్డి, జల్లెల రవి, వ్యాపారులు విలాస్‌రెడ్డి, ఉపలంచి శ్రీను, కత్తూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- వంట గదులు పరిశుభ్రంగా ఉండాలి
- కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-నేరడిగొండ

మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని కోర్టికల్(బి) మండల ప్రాథమిక పాఠశాల, నేరడిగొండ జడ్పీఎస్ఎస్ స్కూల్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరడిగొండ స్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించి, రుచికరమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. సరుకులు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుదినుసులు తదితర తడి లేకుండా శుభ్రమైన చోట భద్రపరచాలని, వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యాబోధన, విద్యార్థుల ప్రగతిపై దృష్టి కేంద్రీకరించి ప్రతి నెల మూడో శనివారం పిటిఎం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పేరెంట్స్, టీచర్ సమావేశాల్లో విద్యార్థుల విద్యా మానసిక సామర్థ్యాలను పిల్లల తల్లిదండ్రులకు తెలియజేయాలని, పరిసరాలు, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కోరిటికల్(బి), నేరడిగొండ ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులను పరిశీలించి, బోర్, త్రి ఫేస్ విద్యుత్ కనెక్షన్, టాయిలెట్స్, పాఠశాల గదులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందిస్తూ కొలతల ప్రకారం యూనిఫాం కుట్టాలని తెలిపారు. ఏకరూప దుస్తుల పంపిణీలో కొలతల ప్రకారం యూనిఫామ్స్ కుట్టనందున అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయురాలు అనితని విద్యార్థులకు ఏం బోధిస్తున్నారని, పాఠాలు అర్థమయ్యేలా చెబుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, ఎక్కువ సంఖ్యలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వందశాతం అడ్మిషన్లు జరగాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మ, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఆర్అండ్‌బి అధికారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మెన్, ఎంపీఓ, సీడీపీఓ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికురాలితో మాట్లాడుతున్న కలెక్టర్



వండిన భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నీట్-2024ను రద్దు చేయాలి

- వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్



నవతెలంగాణ-మంచిర్యాల

నీట్-2024లో జరిగిన అవకతవకలపై న్యాయవిచారణ జరిపించి పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరుతూ మంచిర్యాలలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో గల అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిళ్లకు గురి కాకుండా నిష్పక్షపాతంగా సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జూన్ 4న విడుదలైన నీట్ ఫలితాల్లో 67 మందికి 720 మార్కులకు 720 మార్కులతో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్‌లు రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు ఒకే పరీక్ష కేంద్రం నుండి ఉండడంతో పలు అనుమానాలకు దారి తీస్తోందని తెలిపారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించి దోషులుగా తేలిన వారిని కఠినంగా శిక్షించాలని, పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, ఈదునూరి అభినవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్, ఎఐఎస్ఎఫ్ నాయకులు బచ్చలి అభిరామ్, సిద్ధార్థ, రామగిరి కుమారస్వామి, డీఐఎఫ్ఐ నాయకులు దేవదాసు పాల్గొన్నారు.

పేదలకు ఇండ్ల స్థలాలివ్వాలని సీపీఐ ధర్నా



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు అందజేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ పేదలకు మొండి చూపించిందన్నారు. దండేపల్లి మండలంలో కనీసం అర్హుల గుర్తింపు కూడా లేదని మండిపడ్డారు. ఏ ప్రభుత్వం వచ్చినా పేదలను మోసం చేస్తోందని పేర్కొన్నారు. మండలంలోని పేదలను గుర్తించి అర్హులైన వారికి రెండు పడక గదుల ఇండ్లు మంజూరు చేయాలని, రేషన్ కార్డులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం పెన్షన్ వెంటనే మంజూరు అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, మండల నాయకులు పెరిక రాజేశం, మేదరి దేవవరం, పేదలు పాల్గొన్నారు.

నీట్ అక్రమాలపై న్యాయ విచారణ జరపాలి

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య

నవతెలంగాణ-నిర్మల్

నీట్ అక్రమాలపై న్యాయ విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. కేంద్రంలో మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని పేర్కొన్నారు. అక్రమాలపై న్యాయ విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూన్ 20న పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాపిత ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. కొన్ని రోజులుగా నీట్ స్కాంపై అభ్యర్థులు గగ్గోలు పెట్టడంతో పాటు న్యాయస్థానాలనం ఆశ్రయించినా పట్టించుకోని ప్రభుత్వం, చివరికి సుప్రీం కోర్టు కేంద్రానికి, ఎన్‌టిఎకు నోటీసులు జారీ చేశాక ఎట్టకేలకు విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారని తెలిపారు. రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అంగీకరించినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కుంభకోణంపై విచారణ జరిపిస్తామని కాని, అభ్యర్థులకు ఏవిధమైన న్యాయం చేస్తామనికాని తెలపలేదని పేర్కొన్నారు. నీట్‌లో అక్రమాలు సాధారణంగా చోటు చేసుకున్న చిన్న తప్పులన్నట్లు పేర్కొన్నారే తప్ప, కనీసం పశ్చాత్తాపం వ్యక్తీకరించలేదని మండిపడ్డారు. మంత్రి నుంచి ఇన్నాళ్లకు వెలువడిన పేలవమైన స్పందనబట్టి నీట్ స్కాంను మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కేందుకు తయారుగా ఉందని అర్థమవుతుందని విమర్శించారు. నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు చేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మెన సురేష్, తొడసం శంభు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | జూన్ 19, 2024 | www.navatelangana.com

కేజీబీవీలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రం సోఫీనగర్‌లోని గురుకుల పాఠశాలతో పాటు నిర్మల్ అర్బన్, నిర్మల్ రూరల్, సోన్ మండల కేజీబీవీలను ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, కేజీబీవీ సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఏడాదికి రెండు జతల దుస్తులు ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్, ముత్యం, ప్రవీణ్, నరేష్, ఐకేపీ సీసీ మహేందర్, ఐకేపీ అధ్యక్షురాలు సరస్వతి, పోసాని పాల్గొన్నారు.



పోలీసు జాగిలాలు ఉన్నతమైన సేవలను అందించాయి

- 12 ఏండ్లు పోలీస్ వ్యవస్థకు సేవలందించిన జాగిలం తార పదవీ విరమణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో నిర్విరామంగా శాంతి భద్రతలను పరిరక్షించే క్రమంలో పోలీసు జాగిలాలు ఉన్నతమైన సేవలను అందిస్తాయని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మంగళవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ పోలీసు జాగిలం తార పదవీ విరమణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని, శాలువా పూలమాలలతో సత్కరించి, జాగిలం సేవలను కొనియాడారు. పోలీసు జాగిలం తార 22 జనవరి 2013 రోజున పుట్టి, 2013 సంవత్సరంలో ఐఐటిఎ మొయినాబాద్‌లో ఎల్ సోమన్న హండ్లర్‌కు అందజేసి సంవత్సరం పాటు ఎక్స్‌ప్లోజివ్స్, పేలుడు పదార్థాలను కనుగొనడంలో శిక్షణను తీసుకొని జిల్లాకు వచ్చిందన్నారు. అప్పటి నుంచి 12 సంవత్సరాల పాటు నిర్విరామంగా మందు, గుండు సామాగ్రి అయిన గన్ పౌడర్, ఆర్డీఎక్స్, సేఫ్టీ ఫీజు, టిఎన్టి, పీఇకే, కార్డెక్స్ లాంటి పేలుడు పదార్థాలను కనుగొనడంలో కీలక పాత్ర పోషించి, పోలీసు వ్యవస్థకు ఉన్నతమైన సేవలను అందించిందని తెలిపారు. పోలీసు జాగిలం తారతో హాండ్లర్ ఎల్.సోమన్న జాగిలంతో పాటు విధులను నిర్వర్తించడం జరిగిందన్నారు. ముఖ్యంగా వీఐపీ బందోబస్తుల సమయంలో ముఖ్యమైన వ్యక్తులు కూర్చుండి ఉండే స్టేజి, పబ్లిక్ గ్యాలరీలలో, రోడ్డు భద్రతా విషయంలో రోడ్డుపై, కల్వర్టులలో మందు గుండు, పేలుడు పదార్థాలను కనుగొనడంలో విధులను నిర్వర్తించిందని తెలిపారు. శేష జీవితం ఎటువంటి విధులను నిర్వర్తించకుండా పూర్తిగా విరామంను అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు ఎ.నవీన్, ఎన్ చంద్రశేఖర్, టి.మురళి, బాంబు స్క్వాడ్ ఇన్‌చార్జ్ జే.ప్రేమ్‌సింగ్, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ పి.రమేష్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, డాగ్స్ స్క్వాడ్ బృందం సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రి ఇన్‌పుట్ స్టోర్ ప్రారంభం



నవతెలంగాణ-లోకేశ్వరం

మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ అగ్రి ఇన్‌పుట్ స్టోర్‌ను మంగళవారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన రైతు ఉత్పత్తిదారుల సంస్థ పథకంలో భాగంగా మహిళా అభివృద్ధికి సొసైటీ సహకారంతో మండల కేంద్రంలో ఏర్పాటైన మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ అగ్రి ఇన్‌పుట్ స్టోర్, కేంద్ర ప్రభుత్వశాఖ అయిన సుగంధ ద్రవ్యాల బోర్డు సబ్సిడీ కింద రైతు ఉత్పత్తిదారుల సంస్థకు వచ్చిన పసుపు ఉడకబెట్టే యంత్రాలు, పాలిషర్‌ల ప్రారంభోత్సవానికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. మండలంలోని ప్రతి మహిళా రైతులు రైతు ఉత్పత్తిదారుల సంస్థలో సభ్యత్వం తీసుకుని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కేంద్ర ప్రభుత్వం అందించే, ఇలాంటి సబ్సిడీలను సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయంలో మంచి ఉత్పత్తిని సాధించాలని కోరారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉత్పత్తిదారుల సంస్థలను దేశవ్యాప్తంగా ఏర్పాటుచేసి రైతుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ పంట ఉత్పత్తిని మార్కెటింగ్ అవకాశాలు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. అనంతరం సుగంధ ద్రవ్యాల బోర్డు కింద వచ్చిన 50 టార్పాలిన్ షీట్లను సభ్యులైన రైతు లబ్ధిదారులకు ఎమ్మెల్యే రామారావు పటేల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మెన్ నాగమణి, మహిళా అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మురళి, ప్రాజెక్టు మేనేజర్ రాజేశ్వర్, సంస్థ సీఈఓ మేఘన, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఆసియా, లక్ష్మి, మమత, సబిత, భారతక్క, అకౌంటెంట్ గణేష్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్ కుమార్, ప్రజా ప్రతినిధులైన జయసాగర్‌రావు, మెండ శ్రీధర్, చిన్నరావు, పోతన్న, ప్రవీణ్, భాస్కర్, సాయన్న, ఎంపీటీసీ జీవన్, నల్ల రమేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు రివార్డులు, పురస్కారాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయాణికులకు సంస్థ ద్వారా మంచిసేవలు అందించి ఆర్టీసీ ప్రతిష్టను పెంచాలని, ఆ బాధ్యత ఉద్యోగులపైనే ఉందని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని డిపో గ్యారేజిలో ఉత్తమ సేవలందిస్తున్న కండక్టర్లు, డ్రైవర్లకు ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాలను అందజేశారు. రీజియన్ పరిధిలోని ఆరు డిపోలకు చెందిన ఉత్తమ ఉద్యోగులను గుర్తించి ఈ రివార్డులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవై ఆర్ఎంఓ ప్రణీత్, డీవై ఆర్ఎం ప్రవీణ్ కుమార్, డిపో మేనేజర్ కల్పన, నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, ఆసిఫాబాద్ డిపో మేనేజర్ విశ్వనాథ్, మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్, పర్సనల్ ఆఫీసర్ జిబ్లా, ఆర్ఎం ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ కిరణ్, సిబ్బంది ఉన్నారు.

వికలాంగుల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



వికలాంగులకు ట్రై సైకిల్ అందజేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మహిళ, శిశు వికలాంగుల, వయోవృద్దులు అలింకో సంస్థ సహాయంతో శారీరక వికలాంగులకు బ్యాటరీ మోటారైజ్ ట్రై సైకిల్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై 5నేలలు పూర్తయిందన్నారు. త్వరలో వికలాంగులకు రూ.6వేల చొప్పున పెన్షన్‌లు అందిస్తామన్నారు. సదరం సర్టిఫికెట్ లేని వారు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఫైల్‌లు పట్టుకొని ఎవరు ఆఫీసుల చుట్టూ తిరుగొద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. వాడ వాడల మార్నింగ్ వాక్, పల్లె బాట, ఫోన్ ఇన్, లాంటి కార్యక్రమాలను చేపడుతున్నామని, సమస్యలను నేరుగా తమ దృష్టికీ తీసుకోరావాలని, ఆ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. వికలాంగులు అధైర్యపడకుండా ఆత్మ విశ్వాసంతో బ్రతకాలన్నారు. అర్హులైన వారికి త్వరలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బ్యాటరీ మోటార్ సైకిల్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాధి గ్రామ రైతులకు న్యాయం చేయాలి

- డీఎఫ్ఓకు వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మండలంలోని బాధి గ్రామ రైతులు గత 25 ఏండ్లుగా అదే గ్రామ శివారంలోని సర్వే నెంబర్ 58లోని అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న భూమిలో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు అటవీశాఖ అధికారులు న్యాయం చేయాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి అన్నారు. మంగళవారం డీఎఫ్ఓ ప్రశాంత్ పాటిల్‌కు సంబంధిత రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా నమ్ముకున్న భూమిని కన్నతల్లిగా భావించి, బాది రైతులు ఇదే గ్రామ శివారులోని 58 సర్వే నెంబర్‌లో సాగు చేసుకుంటూ పంటలు పండిస్తూ, జీవనం సాగిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఈ భూమిలో తమ అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం ద్వారా వారు ఉపాధి కోల్పోవడమే కాకుండా, నిరాశ్రయులుగా మారి తిరిగి కూలి పని చేసుకుని బ్రతికే పరిస్థితి ఏర్పడుతుందని తెలియజేశారు. ఇది ఇలా ఉంటే వీరు సాగు చేసుకుంటున్నా పోడు భూములకు గత ప్రభుత్వం పోడు పట్టాలు ఇస్తామని చెప్పి ఇవ్వలేక పోయిందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పోడు పట్టాలు మంజూరు చేసే దిశగా చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో పోడు భూములను సాగు చేసుకుంటున్నా రైతుల నుంచి అటవీ శాఖ అధికారులు భూములు తీసుకొని మొక్కలు నాటకుండా, వారు సాగు చేసుకునే అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. వీరందరూ కూడా నిరుపేద రైతులే అయినందున వారికి న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన డీఎఫ్ఓ ప్రశాంత్ పాటిల్ సానుకూలంగా స్పందించగా, రైతులకు తన పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. అయితే రైతులు కూడా అటవీశాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఇందులో రైతులు వసంతరావు, కొండల వినోద్, మాణిక్‌రావు, శాలిక్, విలాస్, కొండల నారాయణ, దీపక్ ఉన్నారు.



డీఎఫ్ఓకు వినతిపత్రం అందజేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకుడు సామ రూపేష్‌రెడ్డి, గ్రామస్తులు

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి

- తరుచూ విద్యుత్ సరాఫరాలో అంతరాయం
- గ్రామస్తుల ఆందోళన



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్తులు

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం గ్రామస్తులు ముట్టడించారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో అప్రకటితంగా కరెంటు కోతలు విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధిత ఏఈ నిర్లక్ష్యమే కారణమంటూ ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండల కేంద్రానికి నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని సీఎండీ నుంచి అదేశాలున్నప్పటికీ తరుచూ కోతలు విధిస్తున్నారని అన్నారు. మండల కేంద్రంతో పాటు కజ్జర్ల, బరంపూర్, రుయ్యాడి గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నప్పటికీ మూడు గ్రామాల సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. కాని మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సమస్య ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వారం రోజుల నుంచి విద్యుత్ సరఫరాలో గంటల తరబడి అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. రుయ్యాడి గ్రామ సబ్ స్టేషన్ నుంచి మండల కేంద్రానికి అత్యవసర సమయంలో విద్యుత్తు సరఫరా చేసే అవకాశం ఉన్నప్పటికీ ఆ శాఖ అధికారి పట్టించుకోవడం లేదంటూ, మండల కేంద్రవాసులు మండిపడ్డారు. అధికారులతో గ్రామస్తులు మాట్లాడగా సమస్యను పరిష్కరిస్తామంటూ సమాధానం ఇచ్చినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆసం రవి, ఎలుగు ఆనంద్, హర్ష వేణు, నర్సారెడ్డి, మార్కొండ రూపేష్, శ్రీకాంత్, ఉశన్న, రావుల రవి, శంకర్ యాదవ్, గోగరి వేణు, రావుల రవి పాల్గొన్నారు.

170 కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మావలలోని సర్వే నెంబర్ 170లో నివాసం ఉంటున్న నిరుపేదల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.వెంకట నారాయణ అన్నారు. మంగళవారం కాలనీవాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ ఇన్‌చార్జి మేనేజర్ జాదవ్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట నారాయణ మాట్లాడుతూ దాదాపు 100 కుటుంబాలు గత ఎనిమిది సంవత్సరాల నుంచి 170 కాలనీలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారన్నారు. గత ఎనిమిది సంవత్సరాల కాలంలో ఎలాంటి సౌకర్యాలు లేకుండా ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని, చిమ్మ చీకట్లో గత్యంతరం లేని పరిస్థితుల్లో నివసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఎనిమిది సంవత్సరాలుగా ఎలాంటి సౌకర్యాలు లేకుండా నివసిస్తున్న పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలని తాగునీరు, కరెంటు సౌకర్యం, రోడ్డు సౌకర్యాలు కల్పించాలని అలాగే పేదలు నివసిస్తున్న ఇండ్లకు ఇంటి నెంబర్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్రజి హరీశ్, మడావి గణేష్, పీవైఎల్ జిల్లా నాయకులు మెస్రం మారుతి, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు దండేకర్ వామన్, నాయకులు పెరిక గంగమ్మ, తారాభాయి, రఫీక్, మనోజ్, తౌఫిక్, వర్షా రోహిత్, సుఖ్ దేవ్, ఖయ్యూం పాల్గొన్నారు.



అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని మందగూడ గ్రామానికి చెందిన ప్రభుత్వ గిరిజన పాఠశాల ఉపాధ్యాయుడు కిషన్ మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. గత కొద్ది నెలల నుంచి అనారోగ్యానికి గురికాగా, వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నప్పటికీ వ్యాధి నయం కాకపోవడంతో మంగళవారం ఉదయం సొంత గ్రామమైన మందగూడలో మరణించాడు. మండలంలోని కోసాయి గిరిజన పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. క్రమశిక్షణ గల ఉపాధ్యాయున్ని కోల్పోయామని, వారి మరణం తీరని లోటని అన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.



బాలవికాస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో మంగళవారం బాలవికాస నీటి శుద్ధీకరణ ప్లాంటును ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య రీత్యా స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యంగా, ఇది ఒక సామాజిక సేవ కార్యక్రమమని, దీనినీ సద్వినియోగపర్చుకోవాలని, గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆరోగ్యం బాగుంటేనే వ్యవస్థ బాగుంటుందన్నారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించే లక్ష్యంతో ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో, బాల వికాస ప్రాజెక్ట్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ ప్రసున్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ భోజన్న, మహేందర్, మాజీ సర్పంచ్ శైలజ నరేందర్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ జైసాగర్‌రావు, వీడీసీ చైర్మెన్ జీవన్‌రెడ్డి, మండల, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగోరావ్ కుటుంబానికి అండగా ఉంటాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇటీవల గుండెపోటుతో మరణించిన మాజీ సర్పంచ్ గోడం నాగోరావ్ కుటుంబానికి అండగా ఉంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఆయన మారుతి గూడ గ్రామంలోని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ఓదారుస్తూ, కన్నీటి పర్యంతం మయ్యారు. అతని కుటుంబానికి మనో ధైర్యాన్నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక నాయకులు ముఖాడే ఉత్తం ఉన్నారు.

జీఓ నెం. 2ను రద్దు చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

ప్రభుత్వం వెంటనే జీఓ నెంబర్ 2ను రద్దు చేయాలని టీజీయూఎస్ జిల్లా అధ్యక్షుడు ఆడే ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అడే విశ్వనాథ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా మంగళవారం జామడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల పదోన్నతుల్లో అడక్వేసి విధానాన్ని ఎత్తివేయాలని డేట్ ఆఫ్ అక్వైరింగ్‌ను రద్దు చేయాలన్నారు. మొదటి నియామకం తేదీ నుంచే సీనియారిటీ లెక్కించి ప్రమోషన్ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చౌహాన్ నెహ్రూ, ఉపాధ్యాయులు రాథోడ్ హరిచంద్, చంపావతి, రాజ్యలక్ష్మి ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు వెయ్యి రోజుల పాదయాత్ర

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పర్యావరణ పరిరక్షణకు ప్రజలకు అవగాహన కల్పించేలా తన వంతుగా వెయ్యి రోజుల పాదయాత్ర చేపట్టినట్టు హర్యాన రాష్ట్రానికి చెందిన హర్ష్ పండింత్ అన్నారు. ఆగస్టు 21న రాజస్థాన్ నుంచి చేపట్టిన పాదయాత్ర మంగళవారం ఆదిలాబాద్ కు చేకుంది. స్థానిక యువకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మఠం ఎదుట పీఠాధిపతి యోగనంద సరస్వతితో కలిసి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హర్ష్ పండింత్ మాట్లాడుతూ నీడనిచ్చే చెట్లను నరికివేస్తున్నామని, కానీ వాటి స్థానంలో మొక్కలు నాటడటం లేదన్నారు. దాని కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతిని సమయానికి వర్షాలు రావడంలేదన్నారు. ఎండ కాలంలో విపరీతమైన ఎండలు కొట్టాయన్నారు. పర్యావరణంతో పాటు హైందవ సంస్కృతి, సంప్రాదాయలను తెలియజేయడానికి యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. తన యాత్రతో ఇద్దరు మారిన సంతోషమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సాయికుమార్, రాహుల్, గోపాల్, మహేష్, సాయి, వినయ్ పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రయివేటు పాఠశాలల దోపిడీపై జిల్లా నూతన కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థి సంఘాల జేఏసీ మాజీ చైర్మెన్ ఎంబడి చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. 1 వ తరగతి చదువుతున్న విద్యార్థి పుస్తకాలే రూ.4 వేలు ఉంటే, 10వ తరగతి చదువుకునే విద్యార్థుల పుస్తకాలు ఏ స్థాయి ధరలో ఉంటాయో అర్థం కావడం లేదని తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లాలో ప్రయివేటు పాఠశాలలు పుస్తకాల పేరు మీదుగా విచ్చల విడిగా దోచుకుంటునాయని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారుల ఆదేశాలను సైతం ప్రయివేటు పాఠశాలలు పట్టించుకోవడం లేదని స్పష్టం చేశారు. దీనిపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక లేఖ రాస్తానని పేర్కొన్నారు.

మూగజీవాలను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మహారాష్ట్ర నుంచి మూడజీవాలను తరలిస్తున్న వ్యాన్‌ను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నారు. మంగళవారం మండలంలోని గూడెం అంతర్రాష్ట్ర బ్రిడ్జ్‌పై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మహారాష్ట్ర నుండి కాగజ్‌నగర్‌కు వస్తున్న మిని వ్యాన్ (టీఎస్02యూడీ6881)ని తనిఖీ చేయగా ఇందులో పది మూడజీవలున్నాయి. సరైన పత్రాలు లేని కారణంగా వాహనాన్ని, మూగజీవులను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. బెజ్జూర్ మండలం కుకుడ గ్రామానికి చెందిన ఇర్ఫాన్ వద్ద తాము పని చేస్తున్నామని తెలిపారన్నారు. వ్యాన్‌ను సీజ్ చేసి డ్రైవర్, క్లీనర్‌ను స్టేషకు పంపించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇర్ఫాన్ పరారీలో ఉన్నాడని తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వేంకటేశ్, పోలీస్ కానిస్టేబుల్ మధు, రమేష్, సంజీవ్ ఉన్నారు.

ఇంటిని పరిశీలించిన పంచాయతీరాజ్ ఈఈ

నవతెలంగాణ-దహెగాం



లైంగిక దాడి, హత్యకు గురైన చిన్నారి ఇంటిని కలెక్టర్ ఆదేశానుసారం మంగళవారం జిల్లా పంచాయతీ రాజ్ ఈఈ ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి స్థితిగతులు ఇంటి నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించినట్లు పేర్కొన్నారు. రూ.5 లక్షల నిధులతో ఇంటి నిర్మాణం చేసుకునేందుకు అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే అవవుట్ సోర్సింగ్ ఉద్యోగం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నివేదికను కలెక్టర్‌కు ఇస్తానని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, ఎంపీడీఓ రాజేందర్, పంచాయతీ రాజ్ ఏఈ ఆత్మారం పాల్గొన్నారు.

మురుగు కాలువలో పడిన గేదె



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో నాలుగు వరుసల రహదారి నిర్మించిన డీబీఆర్ కంపెనీ ఇష్టానుసారంగా నిర్మించడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మురికి కాలువలు నిర్మించిన అవి పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా మంగళవారం మురికి కాలువలో ఉదయం గేదె ప్రమాదవశత్తు పడింది. గమనించిన స్థానికులు దాన్ని బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్న సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇంకా చాలాచోట్ల రోడ్లు, మురికి కాలువలు నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షానికే హనుమాన్ మందిర్‌కు వెళ్లే దారిలో చిన్నపాటి వర్షానికే దుకాణాల్లో మురికి నీరు చేరి దుకాణదారులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇలాంటి నాసిరకం పనులు జరిగాయని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరిగి మరణాలు సంబవించాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డీబీఆర్ పనులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్పీకి వీడ్కోలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్పీగా 30 నెలల పాటు విధులు నిర్వహించి బాలనగర్ డిసిపిగా బదిలీపై వెళ్తున్న ఎస్పీ సురేష్ కుమార్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో పలువురు సన్మానించారు. ఆసిఫాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులతో పాటు జడ్పీటీసీ నాగేశ్వరరావు ఎస్పిని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో కమ్యూనిటీ పోలీసింగ్ విధానం చేపట్టి ఇక్కడి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ప్రశంసించారు. జిల్లా పోలీస్ అధికారిగా కాకుండా ప్రజల మంచిగా అందరితో స్నేహపూర్వకంగా ఉంటూ ప్రజలు పోలీసులు అనే భేదం లేకుండా సమన్వయం చేస్తూ జిల్లాలో శాంతి భద్రతలను కాపాడడంలో తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు సురేష్, వేణుగోపాల్, శ్రీనివాస్, ఖలీల్, సంతోష్, సతీష్, కుమార్, రాందాస్, మీర్జా, నాయకులు ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

ఖాతాదారులు బీమా చేసుకోవాలి

- తహసీల్దార్ పుష్పలత



నవతెలంగాణ-కౌటాల

ఖాతాదారులు బీమా చేసుకొని ఉండాలని తహసీల్దార్ ఇందారపు పుష్పలత అన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ముత్తంపేట్ శాఖ మేనేజర్ అజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ బీమా పథకం కుటుంబ సభ్యులకు ధీమా ఉంటుందని తెలిపారు. అర్హులైన ఖాతాదారులందరూ బీమా చేసుకోవాలని సూచించారు. మండలంలోని పార్డి గ్రామానికి చెందిన ఖాతాదారుడు ఏకొంకర్ దేవాజీ ఇటీవల అనారోగ్య కారణాల వల్ల మరణించడం జరిగింది. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం కలిగి ఉండటం వలన నామిని పుష్పబాయికి రూ.2 లక్షల చెక్కును తహసీల్దార్ అందజేశారు. మేనేజర్ అజేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బీమా కలిగి ఉండటం ఒక విధిగా అలవర్చుకోవాలి అని చెప్పారు. కార్యక్రమంలో పులిభోగి బందురావు , ఐకేపీ సీఏ సురేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల
రెండో ఎంపిక జాబితా విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి సంబంధించిన రెండవ ఎంపిక జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి జాబితా ప్రవేశాల తర్వాత వివిధ గ్రూపుల్లో మిగిలిన 81 సీట్లను భర్తీకి రెండవ జాబితా విడుదల చేసినట్లు, ఎంపికైన విద్యార్థులు ఈ నెల 19, 20 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని, ఇచ్చిన గడువు లోపు హాజరు కాని విద్యార్థుల సీటు రద్దు చేయబడుతుందని తెలిపారు.

నేటి నుంచి మహిళా డిగ్రీ
కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 19 నుండి 27 వరకు ప్రవేశాల కోసం స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ శారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థినులు బీఎస్సీ(బీజెడ్సీ), బీకాం(సీఏ), బీఎస్సీ(ఎంటీజెడ్సీ), బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఏ(హెచ్ఈపీ) గ్రూపులలో చేరవచ్చని, స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరయ్యే వారు రెండు సెట్ల జిరాక్స్‌లతో రావాలని సూచించారు.

కలవరంలో కౌలు రైతులు

- కాలం కలిసి రాక అప్పుల పాలు
- అయినా చేయక తప్పని వ్యవసాయం
- వరుసగా మూడేండ్లుగా నష్టాలే
- కౌలు రైతులకు సాయం అందిస్తామని ప్రకటించిన సర్కారు
- ఇప్పటికీ ఖరారు కానీని విధివిధానాలు



కౌలుకు తీసుకున్న భూమి చదును చేస్తున్న రాజారాం



పొలంలో పని చేస్తున్న మహిళలు

నవతెలంగాణ-దహెగాం

బతుకు దెరువుకు ఉపాధి మార్గం లేక వ్యవసాయాన్నే నమ్ముకొని జీవిస్తుంటారు. సొంతంగా భూములు లేక కౌలుకు తీసుకొని ఆరుగాలం కష్టపడి పొట్టపోసుకుంటున్నారు. ఏడాదంతా కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోయిన, ప్రతికూల వాతావరణంతో దిగుబడి తగ్గి అప్పుల్లో కూరుకుపోతున్నా ఏ ప్రభుత్వం వీరిపై కనికరం చూపడంలేదు. ఓ వైపు కూలీ ధరలు, కూలీలు, ఎరువులు, విత్తనాల ధరలు ఏటేటా పెరుగుతుండడం కౌలు రైతుల పరిస్థితిని మరింత దిగజారుస్తుంది. ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై కౌలు రైతులు ఆశలు పెట్టుకున్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతులతో పాటు కౌలు రైతులకు సైతం ఏడాదికి రూ.15 వేలు పెట్టుబడికి సాయం ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే పలు గ్యారెంటీలు అమలవుతున్నా రైతు భరోసా పథకం విధివిధానాలు మాత్రం ఇప్పటివరకు ఖరారు కాలేదు.

జిల్లాలో 20 వేల మంది...

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 15 మండలాల పరిధిలో అనధికార లెక్కల ప్రకారం సుమారు 20 వేలకుపైగా కౌలు రైతులు ఉంటారు. వీరిలో అధిక శాతం మంది పత్తి పంట సాగుచేస్తున్నారు. వర్షాధార పంటల్లో ఇతర పంటలతో పోల్చితే ఎక్కువ లాభాలు వచ్చే అవకాశం ఉండడంతో చాలా మంది పత్తి సాగుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో జిల్లాలో బీళ్లుగా ఉన్న భూములు కూడా పత్తి పంట సాగుతో రూ.వేలల్లో కౌలు ధర పలుకుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లోనూ ఎకరానికి రూ.10 వేల వరకు చెల్లించాల్సి వస్తుంది. గ్రామాలకు ఆనుకొని రోడ్డు సౌకర్యం ఉన్న భూములకు ఎకరానికి రూ.15 వేల నుండి రూ.25 వేల వరకు డిమాండ్ ఉంది. మూడేండ్ల క్రితం పత్తి క్వింటాల్‌కు రూ.10 వేలు పలకడంతో భూ యజమానులు కౌలు ధరలు భారీగా పెంచారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం కౌలు ధరలు పెరుగుతూనే ఉన్నాయి.

ఖరారు కానీ విధివిధానాలు...

కౌలు రైతులకు ఆర్థిక సాయం అందించే పథకంపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి విధివిధానాలను ప్రకటించలేదు. ఈ పథకం అర్హుల గుర్తింపుకు కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో భూములు కౌలుకు తీసుకొని ఖరీఫ్ పంట కాలం ప్రారంభమై రైతులు సాగులు చేసుకుంటున్నారు. ప్రభుత్వం కౌలు రైతులకు సైతం ఆర్థిక భరోసా కల్పిస్తామని ప్రకటించడంతో భూ యజమానులు కౌలు పత్రాలు రాసి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. కౌలు పత్రాలు రాసి ఇస్తే రైతు భరోసాకు తామెక్కడ దూరమవుతామోనని భూ యజమానులు భావిస్తున్నారు. అలాగే గుర్తింపుకు ప్రామాణికమైన కౌలు పత్రాలు లేకపోవడంతో పథకానికి దూరమవుతామమని కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కలిసిరాని కాలం...

భూ యజమానులు అడిగినంత కౌలు చెల్లించి భూములు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు గడిచిన రెండేండ్లుగా కాలం కలిసి రావడంలేదు. రెండు సంవత్సరాల క్రితం అధిక వర్షాలతో పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని మండలాల్లో వరదలకు పత్తి చేన్లు పూర్తిగా కొట్టుకుపోగా ప్రభుత్వం నుండి పరిహారం మాత్రం విడుదల కాలేదు. అధిక వర్షాలతో మొక్కల ఎదుగుదల లోపించి దిగుబడి సైతం గణనీయంగా తగ్గింది. చివరికి గిట్టుబాటు ధర రాకపోవడంతో కౌలు రైతులపై అప్పులు మీదపడ్డాయి. గతేడాది వర్షాకాలం సీజన్ ప్రారంభంలో కూడా ఆశించిన స్థాయిలో వానలు బాగా పడడంతో పంటలు బాగా పండుతాయని ఆశపడ్డారు. చివరి దశలో వర్షాలు పూర్తిగా ముఖం చాటేయడంతో పూత, పిందెలు రాలిపోయి దిగుబడి సగానికి సగం పడిపోయింది. వరుసగా మూడేండ్ల పాటు కౌలు రైతులు నష్టాలనే చవిచూశారు. కానీ చేసేదేమీలేక ఈసారి కూడా ఆశల సాగుపై ఎన్నో ఆశలతో వ్యవసాయం ప్రారంభించినప్పటికీ అదిలోనే వర్షాలు రాక రైతులు తీవ్ర ఆందోళన పడుతున్నారు.

ప్రభుత్వ హామీపైనే ఆశలన్నీ...

గత ప్రభుత్వం కౌలు రైతులను పూర్తిగా విస్మరించింది. భూ యజమానులకు పంట పెట్టుబడి సాయం అందించగా కౌలు రైతులకు మాత్రం ఎలాంటి సహాయం అందించలేదు. పెట్టుబడుల కోసం కౌలు రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి పంటలు సాగు చేసిన ఆశించిన దిగుబడి రాక నష్టపోయారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసింది. గుర్తింపు కార్డుల ద్వారా కౌలు రైతులకు బ్యాంకుల్లో రుణాలు, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించేలా చర్యలు తీసుకుంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతుల సంక్షేమం కోసం ఎలాంటి పథకాలు అమలుచేస్తుందో వేచిచూడాలి.

ప్రభుత్వం గుర్తించాలి

మొహమ్మద్ షరీఫ్, కౌలు రైతు, గొర్రెగుట్ట



కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించాలి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి పలు రకాలుగా లబ్ధి చేకూర్చింది. ప్రస్తుతం కూడా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలు రైతులను ఆదుకుంటామని మాట ఇచ్చింది. కాబట్టి కౌలు రైతులను గుర్తించి ఆదుకోవాలి.

కౌలు పత్రాలతో సంబంధం లేకుండా భరోసా అందించాలి

దుర్గం శంకర్ కౌలు రైతు, బీబ్రా



కౌలు పత్రాలతో సంభందం లేకుండానే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసాను అందించాలి. సొంత భూమి లేక 9 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. ఎకరానికి కౌలు రూ.18 వేలు పెట్టిన. ఇతర ఖర్చులు మాములే. ఇంత పెట్టిన భూమి పట్టాదారు మాకు కౌలు పత్రం ఎవ్వరికి ఇవ్వడం లేదు. దీంతో కౌలు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో వ్యవసాయం చేయక తప్పదు. ఇదే జీవనాధారం కాబట్టి. ప్రభుత్వం కౌలు రైతులకు కూడా పత్రాలతో సంబందం లేకుండా రైతు భరోసా ఇవ్వాలి.

బాలిక కుటుంబానికి అండగా ఉంటాం



కలెక్టర్‌తో మాట్లాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో ఈ నెల 14న జిల్లాలోని దహెగాం మండలానికి చెందిన చిన్నారిపై అత్యాచారం చేసి దుండగులు హత్య చేశారని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రేతో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తెలిపారు. బాధిత కుటుంబంతో జిల్లా కలెక్టర్‌ను కలిసి పరిస్థితి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేయడం బాధాకరమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. బాధిత కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇప్పించే విధంగా ప్రయత్నాలు చేస్తామని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా నిందితులకు శిక్షపడేలా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే తమ పార్టీకి చెందిన మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు ఘటనపై స్పందిస్తూ తక్షణ సహాయం కింద రూ.2,50,000 చెక్కు అందజేసినట్టు గుర్తు చేశారు. బాధితులతో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ బాధిత బాదిత కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రభుత్వం తరఫున ఇల్లు నిర్మించి ఇస్తామని, బాధిత తల్లి ఇంటర్మీడియట్ చదివినందున నిబంధనల ప్రకారం ఒప్పంద ఉద్యోగిగా అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం పిల్లలు, మహిళల సంక్షేమం, రక్షణ దిశగా పటిష్టమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. ఇలాంటి బాధాకరమైన ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు, సంబంధిత రక్షణ శాఖలను మరింత పటిష్టం చేస్తూ ప్రజారక్షణకు పకడ్బందీగా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలేష్ గౌడ్, మల్లేష్, వసంతరావు, దహెగా తహసీల్దార్ కవిత పాల్గొన్నారు.

మంత్రిని కలిసి.. సమస్యలు విన్నవించి..



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్యాం నాయక్ హైదరాబాద్‌లో కలిసి జిల్లాలోని సమస్యలపై విన్నవించారు. ముందుగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు. ఆసిఫాబాద్ నుండి ఉట్నూర్ ఎక్స్ రోడ్డు వరకు ఉన్న ప్రధాన రహదారిపై గుంతలు పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నిధులు మంజూరు చేసి పని ప్రారంభించాలని కోరారు. జిల్లాలో పెండింగ్ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు శ్యాంనాయక్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురణం సతీష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయడమే తమ లక్ష్యం అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ అన్నారు. మంగళవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జనకాపూర్ ఎస్సీ కాలనీలో జిల్లా అధ్యక్షుడు టీకానందుతో కలిసి "సమస్యలు చెప్పండి పోరాటం చేద్దాం" అనే నినాదంతో బస్తీబస్తీ కి డివైఎఫ్ఐ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 20 బస్తీలలో ప్రజా సమస్యలపై సర్వే చేసి 24న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. జనకాపూర్ ఎస్సీ కాలనీలో సిమెంటు రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నారని, బోర్‌వెల్ పనిచేయడం లేదని, మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఆరోపించారు. పింఛన్లు సరైన సమయంలో అందడం లేదన్నారు. జిల్లా కేంద్రంలో నిరుద్యోగుల కోసం కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కాలనీలో సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కొరెంగా మాలశ్రీ, నాయకులు కట్కార్ ప్రవీణ్, కట్కార్ మనోజ్, జ్యోతి, కల్పన, కృష్ణవేణి పాల్గొన్నారు.

పాత్రికేయునికి చేయూత



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని కుకుడ గ్రామపంచాయతీకి చెందిన విలేకరి దుర్గం దేవాజి(నమస్తే తెలంగాణ) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం దాతల ద్వారా సేకరించిన రూ.లక్ష ఐదు వేలను మంగళవారం ఆయనకు అందించారు. నిధుల సేకరనలో తోటి పాత్రికేయుడు కనుకుట్ల శ్రీనివాస్(మనతెలంగాణ)ను గ్రామపెద్దలు అభినందించారు. అపద సమయంలో మరో రిపోర్టర్ అండగ నిలడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రహమత్, కొండవీటి భాస్కర్ రాజు, ఖాజా మొయినుద్దీన్, సామల తిరుపతి, తెలంగాణ జావిద్, చాకటి శ్రీధర్ చారి, అమీరుద్దీన్, మహమ్మద్ ఆబిద్ ఖాన్, గుమ్ముల శ్రీనివాస్, తాజుద్దీన్, ఏలేశ్వరం శ్రీనివాసాచారి, నారాయణ పాల్గొన్నారు.

అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.తుకారాం భట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో జాతీయ ఆరోగ్యమిషన్‌లో భాగంగా పొరుగుసేవల ప్రాతిపదికన అర్హత గల పోస్టుల నియామకానికి అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితాను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలోని నోటీసు బోర్డు, అదేవిధంగా వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆసిఫాబాద్.తెలంగాణ.జీఓవీ.ఇన్‌లో పొందుపరిచినట్టు తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 19 నుండి 25 వరకు సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయంలో తగిన ఆధారాలతో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అభ్యంతర స్వీకరణ అనంతరం తుది జాబితను ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో విద్యుత్ లైన్ నిర్వహణ పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో టౌన్ ఏఈ కమలాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సర్‌సిల్క్ కాలనీ, గుంటూరు కాలనీ, డాడా నగర్ కాలనీలకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | జూన్ 19, 2024 | www.navatelangana.com

స్వర్ణకారుల సంఘీభావ దీక్ష



నవతెలంగాణ-జన్నారం

స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లో నరసింహ చారి చేస్తున్న దీక్షకు మద్దతుగా మంగళవారం జన్నారంలో స్వర్ణకార సంఘం నాయకులు సంఘీభావ దీక్ష చేపట్టి నినాదాలు చేశారు. స్వర్ణకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్, ఉప్పుల విజయ్ కుమార్, వెంకటేష్, శ్రీనివాస్, మల్లేష్, నరేష్ పాల్గొన్నారు.

ఎక్కడా లేని ఆంక్షలు కవ్వాల్ టైగర్ జోన్‌లో ఎందుకు..?

నవతెలంగాణ-జన్నారం

దేశంలోని 52 టైగర్ జోన్లలో ఎక్కడా లేని అటవీ ఆంక్షలు కవ్వాల్ టైగర్ జోన్‌లో ఎందుకు పెడుతున్నారని సామాజిక ఉద్యమకారుడు భూమాచారి ప్రశ్నించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఫ్లెక్సీ పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైగర్ జోన్ వల్ల మండలంతో పాటు కడెం దస్తురాబాద్ ఖానాపూర్, పెంబి, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఆ మండలాలకు జన్నారం మండల ప్రధాన రహదారి అడవి గుండా వాహనాలు వెళ్లకుండా ఆంక్షలు విధించారని అన్నారు. వెంటనే భారీ వాహనాలకు విధించిన ఆంక్షలు ఎత్తివేయాలి అన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతి పత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్ త్వరలోనే ఈ సమస్యపై హైదరాబాద్‌కు వెళ్లి అటవీ శాఖ ఉన్నత అధికారులతో సీఎం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అక్బర్, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యవంతమైన జీవితం

● ఎంపీపీ గడ్డం శ్రీనివాస్



నవతెలంగాణ-దండేపల్లి

పిల్లల్లో మానసిక ఎదుగుదల, రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉండడానికి నులిపురుగుల నివారణ మాత్రలు మేలు చేస్తాయని, నులిపురుగుల నివారణతో ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా పాఠశాల ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వారికి అవగాహన కల్పించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువు తున్న ఒకటి నుండి 19 సంవత్సరాలలోపు పిల్లలకు మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు వేయడం వల్ల ఆకలి పెరగడం, బరువు పెరగడం, ఎదుగుదల పెరగడం లాంటి సమస్యలు తీరుతాయన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి నివారణ మందులు వేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మనిషికి గౌరవం, గుర్తింపు

● జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్



నవతెలంగాణ-మందమర్రి

విద్య ద్వారానే సమాజంలో మనిషికి గుర్తింపు గౌరవం దక్కుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఎస్ కిషన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీపతినగర్‌లోని జిల్లా వయోజనవిద్య శాఖ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్, సఖి సహకారంతో నిర్వహిస్తున్న వయోజనవిద్యా, కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అభ్యాసకులను శిక్షకుల కుటుంబ సభ్యుల వివరాలను, ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు డిజైన్ చేసి కుట్టిన దుస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు చదువుకునేందుకు వయసు అడ్డం కాదని విద్యను మధ్యలో ఆపినవారు కూడా ఓపెన్‌గా టెన్త్, ఇంటర్, డిగ్రీలు చదువుకోవాలని సూచించారు. వయోజన విద్యను ముందుకు తీసుకెళ్తూ కుట్టు శిక్షణ కేంద్రం ద్వారా స్వయం ఉపాధి అవకాశాన్ని అందిపుచ్చుకొని ముందుకెళ్తున్న మహిళలను అభినందించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కుట్టు శిక్షణ పొందిన వారికి యూనిఫామ్స్ కుట్టే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా శిక్షకులు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజనవిద్యా శాఖ అధికారి అజ్మీరా పురుషోత్తం, డీఆర్‌పీ బండ శాంకరీ, కోఆర్డినేటర్ ఉప్పులేటి గోపిక, సూపర్ వైజర్ ఉప్పులేటి నరేష్, ట్రైనర్ ఉప్పులేటి శారద పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ ట్రైనీ, డ్రైవింగ్ ప్రొఫిషియన్సీ పరీక్షలు



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి హై స్కూల్ మైదానంలో ఈపీ ఆపరేటర్ ట్రైని, డ్రైవింగ్ ప్రొఫెషియన్సీ పరీక్షలను మంగళవారం జీఎం మనోహర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఈపీ ఆపరేటర్ ట్రైని, డ్రైవింగ్ ప్రొఫెషియన్సీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న 187 మంది అభ్యర్థులకు మంగళవారం 100 మందికి పరీక్ష నిర్వహించామన్నారు. 100 మందిలో 90 మంది హాజరవ్వగా 46 మంది ఉత్తీర్ణత పొందారు. మిగతా 87 మందికి బుధవారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు జూన్ 30వ తేదీన కొత్తగూడెంలో జరుగు రాత పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన వారు మంచిగా చదివి రాత పరీక్షల్లో ఉత్తీర్ణత పొంది ఈపీ ఆపరేటర్లు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, కార్పొరేట్ డీవై పీఎం సంతోష్, డీజీఎం ఐఈడీ రాజన్న కెకె ఓసీపీ ప్రాజెక్టు ఇంజనీర్ సూర్యనారాయణ రాజు, పీఎం ఎస్ శ్యాంసుందర్, డీవై పీఎం సత్య బోస్, ఎస్ఈ వర్క్ షాప్ నాగరాజు నాయక్, ఏఎస్ఓ రవి, సంక్షేమ అధికారులు, పర్సనల్ డిపార్ట్మెంట్ ఆఫీస్ సూపరింటెండెంట్ రాయలింగు, ఎస్ అండ్ పీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పోడు సాగుదారులకు హక్కు పత్రాలివ్వాలి



ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవి కుమార్, జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో ఆదివాసులు ఇతర పేదలు పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. గతంలో కొంత భూమికి హక్కుపత్రాలు వచ్చాయని, ఇంకా చాలా భూములకు రావాల్సి ఉందన్నారు. పోడు సాగున్న కొన్ని మండలు, గ్రామాలను పోడు జాబితాల్లో చేర్చలేదని, ఈ సంవత్సరం అటవీ శాఖ అధికారులు హక్కుపత్రాలు వచ్చిన వారిపై, రానివారిపైన దాడులు చేస్తున్నారని ఆరోపించారు. భూములను సాగు చేయనివ్వడం లేదన్నారు. జన్నారం మండలం తపాల్‌పూర్ గ్రామానికి చెందిన ఆత్రం రాజును అన్యాయంగా అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు పంపారన్నారు. కోటపల్లి రేంజ్ పరిధిలోని అన్ని గ్రామాల్లో అటవీ హక్కు పత్రాలు వచ్చిన పోడు వ్యవసాయ భూములను సాగు చేసుకొనివ్వకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. కోటపల్లి మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన భాగాల చంద్రయ్య, బాగాల మల్లయ్య అను రైతులు తమ భూమిని దున్నుతుండగా అటవీశాఖ అధికారులు వారిని అక్రమంగా అరెస్టు చేసి రెండు రోజులు తమ కార్యాలయంలో బంధించారన్నారు. సుపాక గ్రామంలో హక్కుపత్రం వచ్చిన భూములను దున్నుతుండగా అటవీశాఖ అధికారులు రైతులను వెళ్లగొట్టారని, బొప్పారం గ్రామంలో హక్కుపత్రాలు రాని రైతులు ఎడ్లు నాగాళ్ళ తో దున్నుతుండగా ఏడునాగాళ్లను తీసుకువెళ్లారన్నారు. జిల్లాలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, రైతులు విత్తనాలు వేస్తున్నా కానీ పోడు రైతులు ఎవ్వరు కూడా కనీసం వేసవి దుక్కి కూడా చేయలేదని, దండేపల్లి మండలం కోయపోచగూడెం ఆదివాసీలు ఫారెస్ట్ శాఖ అధికారుల మూలంగా అన్యాయానికి గురైయ్యారన్నారు. జిల్లాలో పోడు హక్కుపత్రాలు ఉన్నప్పటికీ బ్యాంకు పెట్టుబడి రుణాలు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని, దీనివలన ప్రయివేట్ వడ్డీ వ్యాపారులపైన ఆధారపడి వ్యవసాయం చేసుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐకెఎస్ జిల్లా అధ్యక్షులు సంకే రవి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బాగాల రాజన్న, ఎలిగేటి లక్ష్మి ఎస్సే అబ్దుల్లా, ఆత్రం చిన్న రాజు, దోసండ్ల సునీత, సిడాం సమ్మక్క, సూర్ పటేల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్, ఉపాధ్యక్షులు జి. ప్రకాష్, నాయకపోడ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చల్లూరి దేవదాస్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల మారయ్య, డివిజన్ కార్యదర్శి ఆర్ నగేష్, గోమాస అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అభినవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

19 నుండి సికిల్ సెల్ నిర్మూలన పక్షోత్సవాలు

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

సికిల్ సెల్ నిర్మూలనలో భాగంగా ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 19 నుండి జూలై 3 వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఎస్.అనితతో కలిసి సికిల్ సెల్ నిర్మూలన పక్షోత్సవాల గోడప్రతులు, కరపత్రాలు, బ్యానర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జూన్ 19 నుండి జూలై 3 వరకు సికిల్ సెల్ నిర్మూలన పక్షోత్సవాలలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రమంలో గోడప్రతులు, కరపత్రాలు, బ్యానర్లను జిల్లాలో 149 ఉప కేంద్రాలు, 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలకు పంపించి ఆశ కార్యకర్తల ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు. 'జీవితాలను చక్కదిద్దుకుందాం... సికిల్ సెల్ను ఓడిద్దాం... కలిసి కట్టుగా నయం చేసుకుందాం..' అనే నినాదంతో సికిల్ సెల్ నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలోని ప్రత్యేక ప్రచార శిబిరాలలో పరీక్ష సౌకర్యాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. సికిల్ సెల్ వ్యాధి జన్యు పరంగా సంక్రమిస్తుందని, లక్షణాలలో ఎర్ర రక్తకణాలు తమ రూపాన్ని కోల్పోతాయని, దీంతో రక్తనాళాలలో రక్తం ప్రవహించడంలో ఇబ్బందులు ఏర్పడుతాయని, ఫలితంగా చచ్చుపడిపోవడం, ఎముకలు బలహీనం అవుతాయని తెలిపారు. ఇతర అనేక వ్యాధులకు కారణమవుతాయని అన్నారు. ఈ వ్యాధిని తొలిదశలోనే గుర్తించడంతో అసాధారణ స్థితి నుండి సాధారణ స్థితికి మార్చవచ్చని, శిశువులు, బాల్యదశలో ఉన్న వారికి ఈ వ్యాధి ప్రమాదకరమని, మోచేతులు, మోకాళ్ళపై తీవ్ర నొప్పులు ఏర్పడతాయని, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, గుండెజబ్బులు రావచ్చని తెలిపారు. సికిల్ సెల్ నిరోధించడానికి వివాహానికి ముందు ఆడ, మగ తప్పనిసరిగా రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. భావితరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా. ఫయాజ్, డా.నీరజ, ఎన్‌హెచ్‌ఎం డీపీఓ ప్రశాంతి, సబ్ యూనిట్ అధికారులు నాందేవ్, సత్యనారాయణ, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

● అప్రకటిత కోతలు లేని విద్యుత్ అందించాలి
● ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల శాతాన్ని పెంచాలి
● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్



నవతెలంగాణ-జన్నారం

మండల అభివృద్ధికి ప్రభుత్వ అధికారులు సహకరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మాదాడి సరోజన అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల శాతం తగ్గిందని, ప్రసవాల కోసం వస్తే గర్భిణీలను జగిత్యాల్ లక్షెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారని, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్ మండల వైద్యాధికారి ఉమాశ్రీని ప్రశ్నించారు. క్రిటికల్‌గా ఉన్న వారిని మాత్రమే రెఫర్ చేస్తున్నామని ఉమాశ్రీ సమాధానం ఇచ్చారు. మండలంలో అప్రకటిత, నాణ్యతలేని విద్యుత్ సరఫరా అవుతుందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, జన్నారం ఎంపీటీసీ మహమ్మద్ రియాజుద్దీన్ కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్ విద్యుత్ అధికారి లచ్చన్నను నిలదీశారు. విద్యుత్‌పై ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కూడా అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యుత్తును ప్రజలకు అందించాలన్నారు. కడెం ప్రాజెక్టు మరమ్మతులు కూడా పూర్తి అయ్యాయని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కడెం ప్రాజెక్టు నుంచి వారి పంటలకు నీరు అందిస్తామన్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో చెరువు శిఖం భూములను కబ్జాచేసినట్లు తమ దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారు. అలాంటి వారిని గుర్తించి వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని, వాళ్ళు ఏ పార్టీ వారైనా ఊరుకునే సమస్య లేదని అన్నారు. మండలంలోని రైతులకు ఎరువులు విత్తనాలు సకాలంలో అందించి, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ శాఖ అధికారులు చూడాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, ఎంఈఓ విజయ్ కుమార్, ఏఓ సంగీత, పశువైద్యాధికారి కస్తూరి శ్రీకాంత్, ఐసీడీఎస్ సీడీపీఓ రేష్మ, ఈజీఎస్ ఏపీఓ రవీందర్, పీఓపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.



విద్యారంగ సమస్యలపై పోరాటమే ఏఐఎస్ఎఫ్ లక్ష్యం



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆధ్వర్యంలో అఖిల భారత విద్యార్థి సమైక్య(ఏఐఎస్ఎఫ్)లో పలువురు చేరారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్‌గ బచ్చలి అభిరామ్‌ను, కోకన్వీనర్‌గా జిలకర సిద్ధర్థను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సందర్భంగ వారు మాట్లాడుతూ 1936లో లక్నోలోని బెనరస్ యూనివర్సిటీలో ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్ నేటికీ 98 సంవత్సరాలు పూర్తి చేసుకుందని, ఒక వైపు విద్యార్థుల సమస్యలపై, మరోవైపు దేశ స్వాతంత్ర్యం కోసం ముందుండి పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ ఈ దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తున్న విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు కామెర దుర్గరాజ్, రామగిరి కుమారస్వామి, కాసర్ల రవి, వేల్పుల సాయి నిక్షిత్, బచ్చలి హర్షిత్ పాల్గొన్నారు.

అన్న చేతిలో తమ్ముడి దారుణ హత్య



నవతెలంగాణ-నస్పూర్

అన్న చేతిలో తమ్ముడు దారుణ హత్యకురైన సంఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో చోటు చేసుకుంది. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న కుంచం విజయ్(26) తన నాలుగవ అన్న అయినా రాముతో కలిసి నివసిస్తున్నాడు. విజయ్ మంద్యం తాగి అన్న రాముతో తరచు గడవ పడే వారు. సోమవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ కాగా తమ్ముడు అన్నను బండతో కొట్టడంతో కోపోద్రిక్తుడైన రాము పక్కన ఉన్న కర్రను తీసుకొని తమ్ముని తలపై బలంగా కొట్టడంతో తలలోని ఎముక మెదడుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు రెండవ అన్నయ్య సదానందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



నవతెలంగాణ-జన్నారం

కుల గణన నిర్వహించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మండల బీసీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగ బీసీ కులాలు ఉద్యమ పోరాట సంఘం మండల ఉపాధ్యక్షుడు గూడ అశోక్ మాట్లాడుతూ స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలకు వార్డు మెంబర్లు సర్పంచ్, ఎంపీటీసీ జడ్పీటీసీ, ఎంపీపీల ఎన్నికలను బీసీ కులగణన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో నిర్వహించిన సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటనలో స్థానిక సంస్థలకు 42 శాతం బీసీలకు రిజర్వేషన్‌లు ఏర్పాటు చేస్తామని ప్రకటించినందుకు దానికి అనుగుణంగా జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ కేపే నరసింహులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య, కోకన్వీనర్ కడార్ల నర్సయ్య, మంచిర్యాల జిల్లా బీసీ కేయూపీఎస్ కన్వీనర్ ఆడెపు లక్ష్మీనారాయణ, ముదిరాజ్ సంఘం మండలం ఉపాధ్యక్షుడు అయిలవేణి రవి, మున్నూరు కాపు సంఘం నాయకుడు దాసరి శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు దోనోజు శ్రీనివాస్, బాదంపెల్లి ఎంపీటీసీ కాసెట్టి రాజన్న, విశ్వకర్మ సంఘం నాయకుడు రామచందర్ పాల్గొన్నారు.

నేతకాని యూత్ అధ్యక్షునిగా అనపర్తి యువరాజ్ ఎన్నిక



నవతెలంగాణ-నస్పూర్

నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్, రాష్ట్ర, జిల్లాల నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్ లో నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షునిగా అనపర్తి యువరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, విద్య రంగాల్లో ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్న నేతకాని సామాజిక వర్గానికి సమిష్టి కృషితో తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం నాయకులు, సభ్యులు నూతనంగా ఎన్నికైన అనపర్తి రమేష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కామెర ప్రకాష్, కలాలి నర్సయ్య, జాడి రాజారెడ్డి, అధికార ప్రతినిధి గొల్ల రాజమల్లు, న్యాయ సలహాదారు అడ్వకేట్ సల్లూరి మహేష్, సంయుక్త కార్యదర్శి గోమాస రాజం, యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సంతోష్, ఉపాధ్యక్షుడు యువరాజ్, సునార్కర్ రాంబాబు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధం

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల పరిధి రైతుల సౌకర్యార్థం ప్రభుత్వ పరంగా సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు స్థానిక వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ తెలిపారు. 3వ విడుతగా మండల కేంద్రంలో గల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ద్వార రైతులకు జీలుగ విత్తనాలు పంపిణి చేయనున్నట్లు తెలిపారు. జీలుగ విత్తనాలు అవసరమైన రైతులు తమ పట్టాదార్ పాస్ బుక్ జిరాక్స్‌తో బుధవారం ఉదయం 9 గంటలకు భీమారం మండల కేంద్రంలో గల రైతు వేదిక వద్దకు రావాలని ఈ సంధర్భంగా కోరారు.

22న సామాజిక తనిఖీ ప్రజావేదిక

జన్నారం : ఈ నెల 22న ఉదయం 10 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక ఉంటుందని ఎంపీడీఓ శశికళ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రజా వేదికలో మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సర్వే చేసిన అధికారులు నివేదికను ప్రదర్శిస్తారన్నారు. అధికారులు ఈ ప్రజా వేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పీఎం జన్‌మన్ పథకంలో ఒప్పంద ఉద్యోగాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా పీఎం జన్‌మన్ పథకం కింద ఒప్పంద ప్రాతిపాదికన మొబైల్ మెడికల్ యూనిట్‌లో వైద్య అధికారులకు దరఖాస్తులకు స్వీకరిస్తున్నట్టు డీఎంహెచ్‌ఓ ధనరాజ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యాధికారి (01), ల్యాబ్ టెక్నీషియన్ (01), పారమేడికల్ కం అసిస్టెంట్ (01) పోస్టుల కొరకు అర్హత కల్గిన అభ్యర్థుల నుండి నోటిఫికేషన్ నెంబరు 03/2024, దరఖాస్తులు ఆహ్వానించనైనదని తెలిపారు. అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో నిర్మల్.తెలంగాణ.గావ్.ఇన్ నుంచి దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకోని, సంబంధిత అర్హత పత్రాలను జతచేసి, తేదీ 24 జూన్ 2024లోపు డీఎంహెచ్‌ఓ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని రాజుర గ్రామంలో మంగళవారం ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు వైద్యనిపుణులు శ్రీధర్ కంటి పరీక్షలు నిర్వహించారు. కండ్ల సమస్యలు ఉన్నవారికి ఉచితంగా కంటి ఆపరేషన్, అవసరమైన రవాణా ఖర్చులు, మందులు ఇస్తామని తెలిపారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కలిసికట్టుగా పనిచేస్తే విజయం సాధించొచ్చు



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే విజయం సాధించవచ్చని బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తిరుమల పంక్షన్ హాల్లో బీజేపీ ఎంపీ గోడం నగేష్ విజయోత్సవ అభినందన సభ నిర్వహించారు. ముందుగా గోడం నగేష్ ఎంపీగా గెలుపొంది మండలానికి మొదటిగా వచ్చిన సందర్భంగా స్వాగతం పలికి మండల నాయకులు గజమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ బీజేపీ గెలుపు కోసం అహర్నిషలు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మండలాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం స్వగ్రామంలోని నాగోబా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు గోడం నగేష్‌కు పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్, మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్, నాయకులు తాటిపెల్లి రాజు, మేకల వెంకన్న, నానం రమణ, సూది నందు పాల్గొన్నారు.

22న వేలంపాట

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని పోలీసు వాహనాలకు సంబంధించి స్పేర్ పార్ట్స్‌కు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు పోలీసు శాఖ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ టి.మురళి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ సర్వీసెబుల్ స్పేర్ పార్ట్స్ ఒక లాట్, బ్యాటరీలు 167, టైర్లు 504, వాడిన ఇంజన్ ఆయిల్ 5,500 లీటర్లకు వేలం వేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈనెల 22న శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో వేలంపాట ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వివరాలకు 9494433221 ఈ నెంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

పరిష్కార వేదికలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలను సద్వినియోగం చేసుకోవాలని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ రామక్రిష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని నజ్రూల్‌నగర్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిష్కార వేదికలో మొత్తం 11 దరఖాస్తులు వివిధ విద్యుత్ సమస్యలపై రాగా వెంటనే వాటిని పరిష్కరించినట్టు తెలిపారు. వినియోగదారులకు సంబంధించిన అన్ని రకాల సమ్యలను పరిష్కార వేదికలలో పరిష్కరించుకోవచ్చని వివరించారు. ఇందులో విద్యుత్ కంపెనీ సంస్థల సభ్యులు కిషన్, రాజాగౌడ్, జిల్లా ఎస్ఈ వాసుదేవ్, ఏడీఈ శ్రీనివాస్, కాగజ్ నగర్ టౌన్ ఏఈ కమలాకర్, దహెగాం ఏఈ రవీందర్ పాల్గొన్నారు.

అల్పాహారంతో సమయసారణి పాటించే అవకాశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు అల్పాహారం అందజేయడంతో సరైన సమయానికి పాఠశాలకు వచ్చే అవకాశం ఉంటుందని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న అల్పాహార కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించినప్పుడే చదువుపై దృష్టి పెడుతారన్నారు. విద్యార్థులకు పౌష్టికమైన ఆహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ గౌడ్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఉదయబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వర్షాలు కురువాలని పూజలు

నవతెలంగాణ-బేల



మండలంలో రైతులందరూ పత్తి విత్తనాలు విత్తుకున్నారు. అక్కడక్కడ చెదురు, ముదురు వర్షాలు కురవడం, అనంతరం వర్షాలు ముఖం చాటేయడంతో విత్తినాలు విత్తుకున్న వారి విత్తనాలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షలు సంవృద్ధిగా కురువాలని బేల డీలర్స్ వారి సౌజన్యం, అగ్రి ఎంప్లాయి వారి ఆధ్వర్యంలో మంగళవారం కప్పతల్లి ఆటా ఆడారు. ముందుగా స్థానిక గణేష్ ఆలయంలో గణేశునికి, రోలుకు పూజలు చేసి కప్పను కట్టారు. అనంతరం కప్ప పైనా నీళ్ల పోసి డప్పు చప్పుల మధ్య నృత్యాలు చేస్తూ, ఆటా ఆడారు. ఇలా ప్రతి వ్యాపార సముదాయంలో ఆటా ఆడుతూ అలరించారు. అనంతరం కప్పను స్థానిక చెరువులో వదిలి స్థానిక రామాలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ దేవన్న మాట్లాడుతూ ప్రస్తుతం రైతులందరూ పత్తి విత్తనాలు విత్తుకున్నారని వర్షాలు లేక విత్తనాలు ఎండిపోయే పరిస్థితిలో ఉండటంతో డీలర్, అగ్రి ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో కప్ప తల్లి ఆట ఆడారని పూర్వీకుల నుండి వస్తున్న నమ్మకం ఇలా కప్ప తల్లి ఆటాడటం వల్ల వర్షాలు కురుస్తాయని. దేవుడు కరుణించి, రైతులకు పాడి పంటలు సంవృద్ధిగా పండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడ్స్ అండ్ పెస్టి సైడ్స్ డీలర్‌లు అనిల్ గుండావార్, సతీష్ పవార్, తాతావార్ ప్రణయ్, ఇట్టడి శ్రీకాంత్‌రెడ్డి, కంపెనీల అగ్రి ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

నులిపురుగుల నియంత్రణపై ప్రత్యేక చర్యలు

- కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

నులిపురుగుల నియంత్రణపై జిల్లాలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్.అనితతో కలిసి ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సంబంధిత గోడప్రతులు, కరపత్రాలు, బ్యానర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల నియంత్రణలో భాగంగా ఈ నెల 20న జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాలలో 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. జిల్లాలో 2 లక్షల 1143 మంది పిల్లలున్నారని, ఈ నెల 20న ఆల్బెండజోల్ మాత్రలు అందించేందుకు కార్యచరణ రూపొందించామని తెలిపారు. ఆ రోజు మాత్రలు అందని వారికి ఈ నెల 27న మాప్ అప్ రౌండ్ ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. నులిపురుగులుంటే పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, అలసటతో ఉంటారని, శారీరక, మానసిక అభివృద్ధిలో మందకొడిగా ఉంటారని, నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను అందించాలని తెలిపారు. చిన్నపిల్లలకు మాత్రలను పొడిచేసి నీటిలో కలిపి తాగించాలని, భోజనం చేసినంతరం ప్రతి మాత్రను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా.ఫయాజ్, డా. నీరజ, ఎన్‌హెచ్‌ఎం డీపీఓ ప్రశాంతి, సబ్ యూనిట్ అధికారులు నాందేవ్, సత్యనారాయణ, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మందులు ఎలా వేయాలో ఆశ వర్కర్లకు, అంగన్‌వాడీ ఆయాలకు ఆరోగ్య సిబ్బందికి, ఉపాధ్యాయులకు డాక్టర్ వినయ్ వివరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్వాడీలు ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రకృతి జీవకోటికి ప్రాణాధారం : జీఎం



నవతెలంగాణ-నస్పూర్

ప్రకృతి జీవకోటికి ప్రాణాధారమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ప్రగతి మైదానంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీఎం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ భావితరాలకు మంచి వాతావరణం అందించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తూ ఉండాలని కోరారు. స్వచ్ఛమైన గాలి, నీరు అందరికీ అవసరమని, వృక్షో రక్షతి రక్షిత : అనే విధంగా ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని సూచించారు. వృక్షాలను ఎంత ఎక్కువ కాపాడితే జీవకోటి ప్రాణాధారమైన ప్రాణవాయువు అంత ఎక్కువ లభిస్తుందని తెలిపారు. దీన్ని ప్రతి ఒక్కరూ గమనించి వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటాలని కోరారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల సౌకర్యార్థం కావలసిన అన్ని సదుపాయాలు కల్పిస్తుందని, వీటిని ఉద్యోగులు సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం వి పురుషోత్తమరెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ కార్పొరేట్ అజయ్‌కుమార్, డీజీఎం పర్సనల్ శ్రీరాంపూర్ ఏరియా పి అరవిందరావు, డీజీఎం ఏరియా వర్క్‌షాప్ రవీందర్, సర్వే అధికారి వెంకటేశం, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఫారెస్ట్ ఆఫీసర్ రమణరెడ్డి, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్, సీనియర్ పీఓ పి.కాంతారావు పాల్గొన్నారు.

నీట్‌ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి



నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని నాయబాది చౌరస్తా వద్ద మంగళవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నీట్ పరీక్షను రద్దు చేయాలని రాస్తా రోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ ముధోల్ అసెంబ్లీ అధ్యక్షుడు భూషణ్, మండల అధ్యక్షుడు శశి కుమార్ మాట్లాడుతూ నీట్ పరీక్ష చీట్ పరీక్షలగా మారిపోయిందని ఆరోపించారు. దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు రాత్రి, పగలు, కష్టపడి నీట్ పరీక్ష రాస్తే దానిలో అవకతవలు కారణంగా అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ పరీక్షను వెంటనే రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి పార్టీల పోత్తులపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తు మీద లేదని, ప్రధానమంత్రి ఇప్పటికైనా స్పందించకపోవడం దారుణమని అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ సుభత్ కుమార్‌ని వెంటనే తొలగించాలని, అలాగే సుప్రీంకోర్టు ద్వారా దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సరైన న్యాయం చేయాలని లేని పక్షంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని, కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాసర మండల ఇన్‌చార్జ్ గంగాప్రసాద్, దశరథ్, గౌతం, విష్ణు, యశ్వంత్, పవన్ పాల్గొన్నారు.

పదేండ్ల శ్రమకు దక్కిన ఫలితం



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ రికార్డులో పదిహేళ్లుగా నేతకానికి బదులుగా నెట్కని, నేతాని కులం పేరు తప్పుగా ఉండడంతో సరి చేసేందుకు పదేండ్లు శ్రమించాల్సి వచ్చిందని, దానిని సరిచేసిన కార్పొరేషన్ వారికి కృతజ్ఞతలను నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ అన్నారు. మంగళవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేతకాని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుండి కులం పేరు తప్పుగా సర్టిఫికెట్ రావడంతో ఉద్యోగ, ఉపాధి, ఉన్నత విద్య విషయాల్లో నేతకాని యువత ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ఉద్యోగులు ప్రమోషన్ల విషయంలోనూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని అన్నారు. సుమారు రూ.20 లక్షల మంది నేతకానిలకు కులం సర్టిఫికెట్ల సమస్య తీరిందన్నారు. ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా సాధించామని ఇందుకు సహకరించిన సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు, కుల సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కామెర ప్రకాష్, కలాలి నర్సయ్య, జాడి రాజారెడ్డి, అధికార ప్రతినిధి గొల్ల రాజమల్లు, న్యాయ సలహాదారు అడ్వకేట్ సల్లూరి మహేష్, సంయుక్త కార్యదర్శి గోమాస రాజం, యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సంతోష్ ఉపాధ్యక్షుడు యువరాజ్, సునార్కర్ రాంబాబు పాల్గొన్నారు.

ఉచిత గ్రాండ్ టెస్ట్‌లకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రూప్-2 ఉద్యోగాలకు అప్లై చేసుకున్న అభ్యర్థులకు ఉచిత గ్రాండ్ టెస్ట్‌ల కోసం దరఖాస్తుల స్వీకరిస్తున్నట్టు జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం నాలుగు గ్రాండ్ టెస్టులు, 12 పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మొదటి గ్రాండ్ టెస్ట్‌లు జూలై 8న ఉదయం 10 గంటలకు పేపర్-1, మధ్యాహ్నం 1.30కి పేపర్ 2, జూలై 9న ఉదయం 10 గంటలకు పేపర్-3, మధ్యాహ్నం 1.30కి పేపర్-4, ఉంటుందని పేర్కొన్నారు. రెండవ గ్రాండ్ టెస్టులు జూలై 15న ఉదయం 10 గంటలకు పేపర్-1, మధ్యాహ్నం 1.30కి పేపర్ 2, జూలై 16న ఉదయం 10 గంటలకు పేపర్-3, మధ్యాహ్నం 1.30కి పేపర్-4 ఉంటుందని పేర్కొన్నారు. మూడో గ్రాండ్ టెస్టులు జూలై 22న ఉదయం 10 గంటలకు పేపర్-1, మధ్యాహ్నం 1.30కి పేపర్ 2, జూలై 23న ఉదయం 10 గంటలకు పేపర్-3, మధ్యాహ్నం 1.30కి పేపర్-4 ఉంటుందని పేర్కొన్నారు. నాలుగో గ్రాండ్ టెస్ట్ జూలై 30న ఉదయం 10 గంటలకు పేపర్-1, మధ్యాహ్నం 1.30కి పేపర్ 2, జూలై 31న ఉదయం 10 గంటలకు పేపర్-3, మధ్యాహ్నం 1.30కి పేపర్-4 ఉంటుందని పేర్కొన్నారు. ఈ గ్రాండ్ టెస్ట్‌లకు హాజరు కావాలనుకునే ఆసక్తిగల అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్ లైన్ సైట్ నుండి ఆన్ లైన్ ద్వారా జూన్ నుంచి జూలై 5వ తేదీ వరకు అప్లై చేసుకోవాలని సూచించారు. సందేహాలకు, వివరాలకు 08732-221280 నెంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

6 కిలోల కంతిని బయటకు తీసిన రిమ్స్ వైద్య బృందం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రిమ్స్‌లో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. మహిళ కడుపులోని దాదాపు 6కిలోల కంతిని తొలగించి ఉపశమనం కలిగించారు. సర్జరీ బృందంలో ఉన్న ప్రొఫెసర్ డాక్టర్ శిరీష్ మాట్లాడుతూ ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకపూర్‌కు చెందిన రంజన రెండు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధ పడుతోందన్నారు. అన్ని ఆస్పత్రులు తిరిగి చివరికి రెండు వారాల క్రితం రిమ్స్‌కు రావడంతో పరీక్షించి కడుపులో కంతి ఉన్నట్టు గుర్తించామన్నారు. మంగళవారం నలుగురు సర్జన్లు, నలుగురు అనస్తీషియ బృందం సభ్యులు దాదాపు మూడు గంటల పాటు శ్రమించి విజయవంతంగా ఆపరేషన్ చేసి కంతిని తొలగించామన్నారు. కంతి బరువు దాదాపు 6కిలోలు ఉందన్నారు. సర్జరీలో వైద్యులు జక్కుల శ్రీకాంత్, దుర్గా గణేష్, అఫ్గా శిరిన్, అనస్తీయన్లు సతీష్, వెంకటేష్, శరణ్య, శరత్ ఉన్నట్లు తెలిపారు. రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ పర్యవేక్షణలో క్లిష్టమైన ఆపరేషన్లు కూడా రిమ్స్‌లో చేస్తున్నామని తెలిపారు. డైరెక్టర్ డాక్టర్ల బృందాన్ని అభినందించారు.

మంచి ఉద్యోగిని కోల్పోయాం

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో సెర్ప్‌లో అడ్మిన్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అర్ర రాజలింగు ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మంచి ఉద్యోగిని కోల్పోయామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని తన కార్యాలయంలో అర్ర రాజలింగు చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజలింగు అందరితో మమేకమై విధులు చురుకుగా నిర్వర్తించేవారని, కార్యాలయంలో మంచి ఉద్యోగిని కోల్పోయామన్నారు. కార్యక్రమంలో గ్రామీణ ఉపాధిహామీ పథకం, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

మోసాలకు నిలయంగా మారిన ఎన్టీఏ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నీట్ పరీక్ష నిర్వహణకు నోడల్ ఏజెన్సీగా ఉన్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అసమర్థత, అవినీతి, మోసాలకు నిలయంగా మారిందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు శాంతన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి తోట కపిల్ అన్నారు. నీట్‌లో విద్యార్థులకు జరిగిన భారీ మోసం అవినీతికి వ్యతిరేకంగా ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఎస్ఆర్ కళాశాలలో విద్యార్థుల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని అన్నారు. నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. వెంటనే ఎన్టీఏ రద్దుచేసి సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, సీబీఐ ఎంక్వయిరీ వేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దీనికి బాధ్యత వహిస్తూ, విద్యార్థులకు తల్లిదండ్రులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి అశోక్, నాయకులు రాహుల్, సాయి, అంకుష్ పాల్గొన్నారు.

అంతర్గత ఉద్యోగులు పదోన్నతి పొందడానికి అవకాశం

నవతెలంగాణ-నస్పూర్

అంతర్గత ఉద్యోగులు పదోన్నతి పొందడానికి ఏపీ ఆపరేటర్ ట్రైనింగ్ ప్రాక్టికల్ పరీక్షలు మంచి అవకాశమని ఎస్ఓ టు జీఎం పురుషోత్తం రెడ్డి అన్నారు. ప్రగతి మైదానంలో ఈపీ ఆపరేటర్ ట్రైనీ ప్రాక్టికల్ పరీక్షలను పరీక్షల కన్వీనర్ ఎస్ఓ టూ జీఎం మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈపీ ఆపరేటర్ ట్రైనీ ప్రాక్టికల్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులతో మాట్లాడుతూ నైపుణ్యాన్ని ప్రాక్టికల్ పరీక్షలలో ప్రదర్శించి పదోన్నతి సాధించాలని, అలాగే ప్రాక్టికల్ పరీక్షల్లో విజయం సాధించి తమ కెరియర్‌ను ఉన్నతంగా చేసుకోవాలని కోరారు. మొదటి రోజు 135 మందికి గాను 124 మంది హాజరయ్యారు. 65 మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. కార్యక్రమంలో పరీక్షల పర్యవేక్షణ అధికారి అజయ్ కుమార్, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎం పర్సనల్ శ్రీరాంపూర్ ఏరియా పి.అరవింద రావు, ఐఈడీ డీజీఎం చిరంజీవులు, డీజీఎం ఏరియా వర్క్ షాప్ రవీందర్, సర్వే అధికారి వెంకటేశం, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళీ మోహన్ పాల్గొన్నారు.

పట్టణ స్వర్ణకార సంఘం ఏర్పాటు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణ స్వర్ణకార సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని బ్రంహ్మంగారి ఆలయంలో జిల్లా అధ్యక్షుడు నలగొండ శ్రీరాములు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా బొజ్జ గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా వొజ్జకేశవుల రవికుమార్, కోశాధికారిగా ఏలేశ్వరం అఖిల్ కుమార్, గౌరవాధ్యక్షులుగా బ్రంహ్మంచారి, ఉపాధ్యక్షులుగా గన్నవరం శ్రీధరాచారి, సహాయ ప్రధాన కార్యదర్శిగా నర్సింగోజు రవిప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా అభిలాష్, అశోక్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు నలగొండ శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింగోజు సత్యనారాయణ, యూఎస్ చారీ సత్కరించి అభినందించారు.

పద్మశాలి కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇటీవల అనారోగ్యంతో మరణించిన పట్టణంలోని సంఘం బస్తీకి చెందిన బూర కుమారస్వామి కుటుంబానికి పట్టణ పద్మశాలి సేవా సంఘం చేయూతనిచ్చారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో సేకరించిన రూ.22 వేల నగదు, 25 కిలోల బియ్యాన్ని కుటుంబీకులకు అందజేశారు. ఆటో నడుపుతూ జీవనం సాగించే కుమారస్వామి మరణంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయిందని, తమ వంతు సహకారం అందించాలనే దాతల సహకారంతో ఆర్థిక సాయం అందజేసినట్టు పద్మశాలి సేవా సంఘం పట్టణాధ్యక్షుడు దాసరవి వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్, గౌరవాధ్యక్షులు బూర సమ్మయ్య, గడదాసు నారాయణ, ఉపాధ్యక్షులు వంగర రవికుమార్, గౌరవ సలహాదారు గడదాసు శంకరయ్య, దాసరి నారాయణ పాల్గొన్నారు.

హత్య ఘటనలపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ : రాష్ట్రంలో జరుగుతున్న హత్య ఘటనలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గోర్ సేనా జిల్లా అధ్యక్షుడు బాధావత్ రవీందర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అఘాయిత్యాలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినంతరం జిల్లా కేంద్రంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొద్ది రోజులుగా వేరువేరు ప్రాంతాల్లో ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. వీటిలో భాగంగా నడిగడ్డ తండా, మియాపూర్‌లో బాణోత్ వసంత హత్య, పెద్దపల్లి జిల్లాలో ఆరేండ్ల బాలికపై అమానుష ఘటన, ఆదిలాబాద్‌లో జాదవ్ గజేందర్ ఉపాధ్యాయుడి హత్య విషయంలో నేరస్తులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జాధవ్ రాజేందర్, ప్రధాన కార్యదర్శి లావూడియా ప్రవీణ్, కోశాధికారి రాథోడ్ వినోద్, కార్యదర్శి భూక్యా ప్రవీణ్, మాలోత్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.